క్లుప్తంగా

లైబ్రరీ ఏర్పాటు భేష్



రవినాథ్‌ను సన్మానిస్తున్న గోర్ బంజారా నేతలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్టీ బాలుర వసతి గృహంలో జై సేవాలాల్ రాయిసేన గ్రంథాలయం ఏర్పాటు చేయడం స్వాగతించదగినదని ఓయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రవినాథ్ అన్నారు. బాలుర వసతి గృహంలో గోర్ బంజారా అసోసియేషన్ ఏర్పాటు చేసిన లైబ్రరీని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బుక్య భిక్షపతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల పంపిణీ



విగ్రహాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

హుస్నాబాద్: వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతి ఇంటిలో వినాయకుడి మట్టి విగ్రహాలను పూజించాలని జీ5 టౌన్‌షిప్ నిర్వాహకులు సూచించారు. ఆదివారం పర్యావరణ హితంగా వినాయక చవితి జరుపుకోవాలని పిలుపునిస్తూ 1600 గణపతి విగ్రహాలు, మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్ నిర్వాహకులు మాట్లాడుతూ పూజించిన తర్వాత ఇంటి ప్రాంగణంలోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి, అజయ్, సంపత్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ భారత్

హుస్నాబాద్: పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి ఎస్ఐ లక్ష్మారెడ్డి ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటానికి అందరూ కృషి చేయాలని సూచించారు. పరిశుభ్రత పచ్చదనం కోసం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

'సురవరం' సేవలు మరువలేనివి



అక్కన్నపేటలో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అన్నారు. ఆదివారం అక్కన్నపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జపురి రాజు, మాచర్ల శ్రీనివాస్, బైరి, శ్రీనివాస్, ఎల్లయ్య, రాములు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో సీపీఐ నాయకులు సురవరం సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాటాలను స్మరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి రూపేష్, నాయకులు మధు, పరశురాములు, బాబు, మల్లారెడ్డి, రాములు, అలీ, మహేశ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోండి



సుమన్‌కుమార్

సిద్దిపేటకమాన్: గణేశ్ నవరాత్రులను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. మండపాలను రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకోవాలని, బస్టాండ్ చౌరస్తా, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయవద్దని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. నిమజ్జన ఊరేగింపులో అంబులెన్స్‌లకు దారి ఇవ్వాలని సూచించారు.

అరెస్టులను ఖండిస్తున్నాం

సిద్దిపేటకమాన్: ఆదివాసీ హక్కులపై కోసం పోరాటం చేస్తున్న నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్‌లో తలపెట్టిన బహిరంగసభకు ప్రభుత్వం అనుమతించకపోవడం, అక్రమ అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, నర్సింహులు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యంపై పట్టింపేదీ?

శిథిలావస్థలో ఆస్పత్రులు

- సౌకర్యాలు, సిబ్బందిపై చిన్నచూపు
- అందని నట్టల నివారణ మాత్రలు
- తొమ్మిదేళ్ల క్రితమే బంద్‌దైన ఇన్సూరెన్స్
- మృత్యువాత పడుతున్న జీవాలు

గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. చాలా చోట్ల పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. కొన్ని చోట్ల అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. వైద్యులే తమ సొంత డబ్బులతో నడిపిస్తున్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.



గాలికుంటు వ్యాధి సోకిన మేకలు....



సముద్రాలలో అద్దె భవనంలో పశువైద్యశాల

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన ఓదెలుకు సుమారు 20 మేకలు ఉన్నాయి. అందులో సగానికిపైగా గాలికుంటువ్యాధి బారిన పడ్డాయి. మిగతావి సీజనల్ వ్యాధులు సోకడంతో అనారోగ్యం పాలయ్యాయి. ఇప్పటికే రూ.35 వేలు విలువచేసే రెండు మేకలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని చాలా మంది పశుపోషకుల పరిస్థితి ఇలానే ఉంది. అవసరమైన మందులు అందించడం లేదని వాపోతున్నారు.

శిథిలావస్థలో ఆస్పత్రి భవనం

మండల కేంద్రంలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. దానికితోడు సరైన సదుపాయాలు లేక వైద్యుడు, సిబ్బంది అవస్థలకు గురవుతున్నారు. మండల పరిధిలోని శనిగరం గ్రామంలో ఇప్పటికీ పశువుల వైద్యశాల లేకపోవడంతో మూగజీవాలకు వైద్యసేవలు అందడం లేదు. అలాగే సముద్రాల గ్రామంలో గతంలో ఉన్న సబ్‌సెంటర్‌ను నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయంలో కలిపేశారు. దీంతో అక్కడి జూనియర్ వెటర్నరీ అధికారి శ్రీధర్ తన సొంతం డబ్బులతో నెలకు రెండు వేలు అద్దె చెల్లిస్తూ వేరే భవనంలో వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారు.

నట్టల ముందులు లేనేలేవు!

మేకలు, గొర్రెలకు రెండేళ్లుగా నట్టల మందులు అందడం లేదు. మండల వ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం 22,500 గొర్రెలు, 4,500 మేకలు, ఆరు వేల గేదెలు, 5,500 ఆవులు, ఎడ్లు ఉన్నాయి. అలాగే పశువులకు తొమ్మిదేళ్లుగా ఇన్సూరెన్స్ సౌకర్యం నిలిచిపోయింది. దీంతో పిడుగుపాటు, అనారోగ్యంతో మృతి చెందిన పశువులకు ఇన్సూరెన్స్ పొందలేక పాడి రైతులు నష్టపోతున్నారు. తమ జీవనాన్ని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందులు అందించాలి



కాళ్ల డెక్కల మధ్య పుండ్లు పడి.. నడవలేక, మేత సరిగా తినలేక రెండు మేకలు చనిపోయాయి. మునుపటిలాగా దవాఖానలలో నట్టల మందులు ఇవ్వడం లేదు. సర్కారోళ్లు మునుపటిలాగానే మందులన్నీ ఉచితంగా అందించాలి. పశువులు చనిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

– ఓదెలు, మేకల కాపరి, కోహెడ

నట్టల మందు కోసం నివేదించాం..



ప్రతి మూడు నెలలకు ఒక్కోసారి వేసే నట్టల మందు అవసరం ఉంది. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. అందుబాటులోకి రాగానే అందజేస్తాం. గొర్రెలు, మేకలకు బ్లూటంగ్(నీలి నాలుక) వాక్సిన్స్ 40 శాతం పూర్తి చేశాం. 9 వేల జీవాలకు గాలికుంటు టీకాలు, 30 శాతం గొర్రెలకు పీఆర్‌పీ టీకాలు వేశాం.

– శ్రావణ్, పశువైద్యాధికారి, కోహెడ

నేడు రాజీవ్ రహదారి ముట్టడి

జేఏసీ కన్వీనర్ మల్లేశం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటును డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన రాజీవ్ రహదారి ముట్టడిని ప్రజలంతా జయప్రదం చేయాలని మద్దూరు, దూళ్మిట్ట మండలాల జేఏసీ కన్వీనర్ మల్లిపెద్ది మల్లేశం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం సాగుతున్న పోరాటంలో ఈ ప్రాంత ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దుద్దెడ చౌరస్తా వద్ద ఉదయం 11 గంటలకు రాజీవ్ రహదారి ముట్టడి ఉంటుందని, అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మద్దూరు, దూళ్మిట్ట మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, యాదగిరి, మాజీ ఎంపీటీసీ సమ్మయ్య, పరశురాములు, మాజీ సర్పంచ్ సుదర్శన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కనకరాజు, సత్యం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..

కొండపాక(గజ్వేల్): మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం ఉదయం 11 గంటలకు అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా, ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ వకులాభరణం నరసయ్య పంతులు కోరారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, విద్యార్థులు, కార్మిక, ప్రజా సంఘాలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'సిరి' షార్ట్ ఫిలిం ప్రారంభోత్సవం

దౌల్తాబాద్(దుబ్బాక): స్థానిక యువకుడు రూపొందించిన 'సిరి' లఘు చిత్రాన్ని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రహీమొద్దీన్ ఆదివారం ప్రారంభించారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన దౌల్తాబాద్‌కు చెందిన యువకుడు అల్వాల రాజు నిర్మాత మహ్మద్ జాఫర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం పెంపొందించే నేపథ్యంలో ఈ చిత్రం రూపొందించామని చెప్పారు. ఈ చిత్రాన్ని యూట్యూబ్ చానెల్లో విడుదల చేశామని తెలిపారు.



లఘు చిత్రాన్ని ప్రారంభిస్తున్న రహీమొద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న శశిధర్



మాట్లాడుతున్న రవీందర్

యూరియా అందుబాటులో ఉంచాలి

సీపీఎం జిల్లా నాయకుడు శశిధర్

కొండపాక(గజ్వేల్): వర్షాకాలం సాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రవీంద్రనగర్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంటలకు యూరియా అవసరం ఉంటుందని, ప్రభుత్వం సరిపడా యూరియాను అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల తరబడి లైన్‌లో ఉన్నప్పటికీ బస్తా యూరియా దొరకని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఎంపీలు బీజేపీపై ఒత్తిడి పెంచడంలో విఫలమయ్యారని ఆరోపించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కనకాచారి, రవికుమార్, బాల్‌నర్సయ్య, రవీంద్రచారి, నాగరాజు, కనకయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సరఫరాలో విఫలం..

కొమురవెల్లి(సిద్దిపేట): పోలీసుల పహారాలో ప్రభుత్వం యూరియా విక్రయించడం సిగ్గుచేటని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల పహారాలో యూరియా అమ్మడం రైతులను అవమానపరిచినట్లేనని మండిపడ్డారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వ్యవసాయ అధికారులు 20 మంది పోలీసుల కాపలా పెట్టి రైతులకు యూరియా కోసం చీటీలు రాసి ఇచ్చారని వాపోయారు. తక్షణమే రైతులకు సరిపడా యూరి యా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తేలు ఇస్తారి, కర్రోల్ల ఎల్లయ్య, తాడూరి భరత్, సున్నం యాదగిరి, శ్రవణాచారి తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం



దుద్దెడలో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొండపాక(గజ్వేల్)/బెజ్జంకి(సిద్దిపేట)/చిన్నకోడూరు(సిద్దిపేట): పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదివారం కరీంనగర్ వెళ్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గాడిపల్లి రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా మండలాల పరిధిలో ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మహేశ్‌కుమార్ గౌడ్‌కు శాలువాలు కప్పి సత్కరించారు. ఆయా కార్యక్రమాలలో కాంగ్రెస్ నాయకులు సూర్యవర్మ, బుచ్చిరెడ్డి, పూజల హరికృష్ణ, చిరంజీవి, కిష్టారెడ్డి, యాదగిరి, నాయిని నర్సింహారెడ్డి, సామల సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్, ఎస్ఎల్ గౌడ్, మన్‌మోహన్‌రావు, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, రత్నాకర్‌రెడ్డి, రమేశ్, రవీంద్రాచారి, భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి ఔదార్యం



ఆర్టీసీ బస్‌షెల్టర్‌లో ఏర్పాటు చేసిన బెంచ్‌లు

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ నాయకుడు ఔదార్యం చాటారు. కాంగ్రెస్ నాయకుడు మహేందర్ స్థానిక ముస్తాబాద్ చౌరస్తాలో ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల కోసం కూర్చోవడానికి ఇబ్బందులు ఉన్నట్టు డిపో మేనేజర్ రఘు వార్డు నాయకుడు మహేందర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ఐదు సిమెంట్ బెంచ్‌లను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిపో అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

సంఘటితమైతేనే హక్కుల సాధన

సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్



పుస్తకం ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హక్కుల సాధన కోసం నక్కల కులస్తులంతా సంఘటితం కావాలని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ పిలుపునిచ్చారు. సమరసత వేదిక, నక్కల కుల హక్కుల సంక్షేమ సమితి నాయకులు సిద్దిపేటలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా నక్కల కులస్తులు ఇంకా దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. కులధ్రువీకరణ పత్రాలు అందజేయకపోవడమే దానికి నిదర్శనమన్నారు. ఎస్టీ కోటాలో వారికి కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నక్కల కుల హక్కుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి మాట్లాడారు. తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం, సంక్షేమం అందడం లేదని వాపోయారు. నక్కల కులస్తుల జీవన స్థితిగతులు, వారి ఆచార వ్యవహారాలపై అధ్యయనం చేసి, రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో అరవింద్ కుమార్, రమేశ్, సంతోష్, రాజశేఖర్‌రెడ్డి, పెద్దగోపి, చిన్నగోపి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల సామూహిక వనభోజనాలు



వనభోజనాలలో పాల్గొన్న పద్మశాలీలు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో కిష్టస్వామి గుట్టపై పద్మశాలీలు ఆదివారం సామూహిక వనభోజనాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం పలు రకాల ఆటపాటలతో మహిళలు సందడి చేశారు.

విశ్వబ్రహ్మణ నూతన కార్యవర్గం

చేర్యాల(సిద్దిపేట): విశ్వబ్రహ్మణుల సంఘం నూతన కార్యవర్గం ఎంపికైంది. మమ్మాయమ్మ ఆలయంలో ఆదివారం అధ్యక్ష, కార్యదర్శుల నియామకం కోసం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా సత్యనారాయణ, కార్యదర్శిగా భాస్కర్ ఎన్నిక య్యారు. అధికారులుగా యాదగిరి, ఉప్పలయ్య, శ్రీరాములు, రమేశ్ తదితరులు వ్యవహరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల కేంద్రంతో పాటు బెక్కల్, బైరాన్‌పల్లి గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని దూళ్మిట్ట ఏఈ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132 కేవీ ముస్త్యాల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

గుంతలమయం.. ఎలా వెళ్లడం!

మండలంలోని హబ్సిపూర్, ధర్మాజీపేట సబ్‌స్టేషన్ నుంచి చేర్వాపూర్‌కు వెళ్లే దారి గుంతలు ఏర్పడి బురదమయంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆ దారిలో వెళ్లాలంటేనే బెంబేలెత్తుతున్నారు. చిన్న చినుకు కురినా వర్షపు నీరు గుంతల్లో చేరి ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– దుబ్బాకరూరల్



బురదమయంగా మారిన రోడ్డు

అల్లుకున్న నిర్లక్ష్యం..

మండల పరిధిలోని మాచాపూర్‌లో ఉన్న ఓ విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్కలు, పొదలు అల్లుకుని పచ్చని పొదల మధ్య విద్యుత్ తీగలు కనిపించకుండా మూసుకుపోయాయి. దీంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, పొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)



మాచాపూర్‌లో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పొదలు



సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న మహేశ్వరి, డాక్టర్ స్వామి, నాగరాజు

పర్యావరణాన్ని కాపాడుదాం

సిద్దిపేటకమాన్: మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ మహేశ్వరి పిలుపునిచ్చారు. పర్యావరణ ప్రేమికుడు రాధారి నాగరాజు, డాక్టర్ డీఎస్ స్వామి ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎకో ఫ్రెండ్లీ గణేశ్ సెల్ఫీ పాయింట్‌ను ఆమె ఆదివారం ప్రారంభించారు. నిర్వాహకులు నాగరాజు, డాక్టర్ స్వామిని అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): సీఎం సహాయనిధి పేదల ఆరోగ్యానికి వరం లాంటిదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని లద్నూర్ గ్రామానికి చెందిన కాటం శ్రీధర్‌కు మంజూరైన రూ.4 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గిరికొండల్‌రెడ్డి, జనగామ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు చెట్కూరి కమలాకర్‌యాదవ్, నాయకులు దాసరి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం అందజేత

దౌల్తాబాద్(దుబ్బాక): ఇటీవల అనారోగ్యంతో మరణించిన మండల పరిధిలోని అప్పాయిపల్లికి చెందిన రామన్నగారి కుటుంబ సభ్యులను ఆ గ్రామ నాయకులు పరామర్శించారు. ఆదివారం వారు రూ.12,500 ఆర్థిక సహాయం, మూడు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. మాజీ సర్పంచ్ సుగుణ యాదగిరి, ప్రభాకర్, రమేశ్, వెంకటేశ్, స్వామి, నర్సింహులు, సాయిలు, స్వామి, ఎల్లం, నారాయణ, కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ పాడిగేదె మృతి



మృతి చెందిన గేదె

నంగునూరు(సిద్దిపేట): విద్యుతాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన ఆదివారం నంగునూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పప్పు రాజిరెడ్డి రోజూ మాదిరిగానే తన గేదెను వ్యవసాయ బావి వద్ద వదిలాడు. అది సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురైంది. దాని విలువ రూ.2 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఇబ్బందులకు గురిచేయడం సరికాదు



నిరసన తెలుపుతున్న టిప్పర్ యజమానుల అసోసియేషన్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మైనింగ్, రెవెన్యూశాఖ అధికారులు తమను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని టిప్పర్ ఓనర్ల అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం వారు టిప్పర్లు నిలిపివేసి సమ్మె చేపట్టారు. వారు మాట్లాడుతూ వివిధ శాఖల అధికారుల వల్ల టిప్పర్లు నడిపలేక పోతున్నామన్నారు. అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మల్లేశం, రంగం, సంపత్, ప్రశాంత్, రాజు, శ్రీను, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.